కోయిల్‌సాగర్‌కు కృష్ణమ్మ పరవళ్లు

- సాగుపై ఆయ కట్టు రైతుల ఆశలు
- పెరుగుతున్న ప్రాజెక్టు నీటిమట్టం


ఆయకట్టు కింద వేసిన నారుమళ్లు (ఫైల్)


కోయిల్‌సాగర్‌కు పంపింగ్ అవుతున్న నీరు (ఫైల్)

మరికల్: జూరాల బ్యాక్ వాటర్ నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. మండలంలోని తీలేర్ పంపుహౌస్ స్టేజీ–2 వద్ద ఈ నెల 18న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఒక పంపును ప్రారంభించడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కోయిల్‌సాగర్ వైపు పరుగులు పెట్టింది. దీంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో క్రమంగా నీటి మటం పెరగడంతో వానాకాలం పంటల సాగుపై రైతులు ఓ అంచనాకు వస్తున్నారు. జూరాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యాల స్టేజీ–1 మోటార్‌ను ప్రారంభించి అక్కడి నుంచి నుంచి పర్దీపూర్ రిజర్వాయర్ నింపిన తర్వాత స్టేజీ–2 నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేశారు. ఒక పంపు నుంచి నిత్యం 315 క్యూసెక్కుల నీరు కోయిల్‌సాగర్‌కు చేరుతుంది. మరికల్ మండలంలో ఉన్న చెరువులను నింపేందుకు 150 క్యూసెక్కుల నీరు లింకు కెనాల్‌కు విడుదల చేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఒకసారి పూర్తిస్థాయిలో నిండితే రెండు పంటల సాగుకు ఉపయోగపడుతోంది. జూరాల నీరు విడుదలకు ముందు ప్రాజెక్టులో 10 ఫీట్ల వరకు నీరు ఉండగా ప్రస్తుతం 13 ఫీట్లకు చేరుకుందని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పుడిప్పుడే ఆయాకట్టు కింద రైతులు నారుమళ్లకు సిద్ధమవుతున్నారు. పూసల్‌పహాడ్ శివారులో 13వ తూము కింద 650ఎకరాలు ఉండటంతో సాగునీరు అందడం లేదని, మరో కొత్త తూమును ఏర్పాటు చేయాలని ఆయాకట్టు రైతులు గత ఎమ్మెల్యే ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కాని అది అప్పట్లో కార్యరూపం దాల్చలేదు.

కుడి, ఎడమ కాల్వల కింద సాగు ఇలా..

కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల కింద కలిపి పాత ఆయా కట్టు 12 వేలు, కొత్త ఆయా కట్టు 38,200 మొత్తం 50,200 ఎకరాల ఆయా కట్టు ఉంది. జూరాల బ్యాక్‌వాటర్ ద్వారా కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నింపడంతో ఏటా ప్రాజెక్టు కింద దాదాపు 20వేలకు పైగా వరిసాగవుతుంది. యాసంగిలో ఆరుతడి పంటలు 3వేలకు పైగా, వరి 10వేల ఎకరాల వరకు సాగవుతుంది. ఇందుకు గాను అధికారులు ప్రతి సీజన్‌కు గాను 15రోజులకు ఒక్కసారి పంటలకు ఆరు తడులు కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేస్తారు. ప్రస్తుతం ఆయా కట్టు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

నారుమళ్లు సిద్ధం చేస్తున్నాం..



కోయిల్‌సాగర్‌కు జూరాల బ్యాక్ వాటర్ రావడంతో వరి సాగు కోసం ప్రస్తుతం నారుమళ్లు సిద్ధం చేస్తున్నాం. అధికారులు స్పందించి ఆయాకట్టు రైతుల సమావేశం ఏర్పాటుచేసి విడతల వారిగా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో కోయిల్‌సాగర్ నీటి విడుదలపైనే ఆధారపడి ఉన్నాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, పూసల్‌పహాడ్

విడతల వారీగా..

ప్రాజెక్టు కింద వరిసాగు చేసే ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించిన తర్వాత ఎన్ని విడతల వారిగా నీళ్లు వదలాలనే అంశంపై తీర్మానం చేస్తాం. ప్రస్తుతం జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని ఎత్తిపోయడంతో క్రమంగా నీటిమట్టం పెరుగుతుంది. పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిండిన తర్వాత కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేస్తాం.

– కిరణ్‌కుమార్, డీఈఈ

కొనసాగుతున్న వక్ఫ్ భూముల గుర్తింపు సర్వే


సర్వే చేస్తున్న అధికారులు, బోర్డు రాష్ట్ర సభ్యులు

కోస్గి: మండల పరిధిలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములను గుర్తించేందుకు చేపట్టిన సర్వే రెండోరోజు శనివారం సైతం కొనసాగింది. ఈజీపూర్‌లో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల బృందం సర్వేయర్లతో కలిసి వక్ఫ్ భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఈ మేరకు ఈజీపూర్‌లో సర్వే నంబర్ 270లో అన్యాక్రాంతమైన భూములు గుర్తించేందుకు సర్వే చేశారు. గుర్తించిన భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ సర్వేయర్ మూస, మండల సర్వేయర్లు అరుణ, అశోక్, మునీందర్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ రియాజ్, చైన్ మెన్‌లతోపాటు వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


ప్రచారంలో కళాశాల అధ్యాపకులు

మద్దూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటారని, ప్రైవేట్ జూనియర్ కళాశాలల కంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్యా అందుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సూచించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోనూ, గ్రామాల్లోనూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ 2024–25 విద్యా సంవత్సరంలో పదోతరగతి పాసైన తమ పిల్లలను ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ అడ్మిషన్లు చేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఇదేక్రమంలో పలు ఉన్నత పాఠశాలలో సైతం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, అధ్యాపక బృందం శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రాజేష్, మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక సాధికారతకు కృషిచేయాలి


అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సిబ్బంది

దామరగిద్ద: బాలిక సాధికారతకు కృషిచేయాలని జీహెచ్‌ఎం అన్నపూర్ణ, జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో –ఆర్డినేటర్ నర్సింహులు, సఖి కేంద్రం అడ్మిన్ క్రాంతి అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన నిర్వహించారు. బాల్యవివాహాలు, సమాజంలో ఎదరయ్యే ఇతర సంఘటనపై నిర్భయంగా టోల్ ఫ్రీ నంబర్ 1098, 121,181, 100కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని సమాజ ఉన్నతికి పాటుపడేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సునిత, ప్రవీణ్‌కుమార్, నర్సింహ, అనిత, విజయ్, పీఈటీ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ

మాగనూర్: మక్తల్ మినీస్టేడియంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గస్థాయి 4వ తరగతి ప్రవేశం కోసం క్రీడా పాఠశాల ఎంపికలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యశ్వంత్‌గౌడ్, తరుమలేష్ పాల్గొని తొమ్మిది క్రీడా అంశాలలో అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించారని పాఠశాల ఉపాధ్యాయురాలు దీప అన్నారు. ఆ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పాఠశాల పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్నిరంగాలలో నైపుణ్యం ప్రదర్శించడం ఉపాధ్యాయుల గొప్పతనం కనబడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వప్న, సీఆర్పీ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకుల హర్షం


ఊట్కూరులో మాట్లాడుతున్న నాయకులు

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ ప్రకటించడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ ఆనందం వ్యక్తం చేశారు. రైతులకు ఏకకాలం రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు అట్టి వాగ్దానాన్ని నెరవేర్చే క్రమంలో శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రెండు లక్షల రుణమాఫీ ఆమోదం తెలుపడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్‌కుమార్, రవికుమార్, కట్ట సురేష్, గొల్లపల్లి నారాయణ, వెంకటేష్, నాగేష్, శేఖర్‌రెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌కు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణిరెడ్డి, ఉజ్జెల్లి కృష్ణయ్య, దండు ఆనంద్, వాకిటి శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, పెద్దింటి రాజు, గోవర్ధన్‌గౌడ్, వర్కూర్ ఆంజనేయులు, వేణు, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజ్ఞేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు, గృహాలకు ఉచిత విద్యుత్ తదితర పథకాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎల్కోటి నారాయణరెడ్డి, మణెమ్మ, సూర్య ప్రకాష్‌రెడ్డి, లింగం, శంకర్, కుర్షిద్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: కాంగ్రెస్ రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందని, రైతుల సంక్షేమ పార్టీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లె సురేష్, శంకర్‌రెడ్డి, ఆసీఫ్, అంజప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: సుశ్రుత ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సుశ్రుత ఆస్పత్రిలో పిల్లలు పుట్టాలని కోరుకునే వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సెమెన్ ఎనాలసిస్, అల్ట్రాసౌండ్, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పిల్లలు కావాలనుకునే దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానం కోసం అన్ని రకాల వైద్యసేవలు సుశ్రుతలో అందుబాటులో ఉన్నాయని, అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 88852 21877, 9866 457501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పేట సిటిజన్స్‌క్లబ్ ఆవరణలో..

నారాయణపేట రూరల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఉదయం 10గంటలకు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ న్యాయ సలహాదారు నాగురావు నామాజీ తెలిపారు. శనివారం శిబిరం కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఆయుర్వేద పంచకర్మ ఎండీ వైద్యులు డాక్టర్ ఉమా, రవళి బృందం నరాలకు సంబంధించిన వ్యాధులు, మోకాళ్లనొప్పులు, చర్మవ్యాధులు, నడుమునొప్పి తదితర వ్యాధులకు శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా వైద్యం చేస్తారని తెలిపారు. వివరాలకు 9391078760నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, శ్యాం సుందర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు కుర్చీలను శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయుల సౌకర్యార్థం కుర్చీలను అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన అమ్మపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అధికారులు అభివృద్ధి పర్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం




మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన తల్లిదండ్రుల సమావేశంలో క్లస్టర్ హెచ్‌ఎం నాగరత్నమ్మ విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిల్ అందజేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, తిరుపతమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

మరికల్: అడవుల్లో రాత్రివేళల్లో చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కాట్టి కొండ రాజు అన్నారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పొలాల్లో నరికిన మామిడి చెట్లును పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకోసం ప్రభుత్వం చెట్లు పెంచితే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే చెట్లు నరకడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా అటవిశాఖ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని వారికి ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని సరస్వతీ శిశుమందిర్‌లో గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు అశోక్‌నాయక్ తన సోదరుడు కీర్తిశేషులు సుధాకర్‌నాయక్ జ్ఞాపకార్థం శనివారం లాంగ్‌నోట్ బుక్కులు, పెన్నులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంతు, హెచ్‌ఎం జయప్రకాష్, శ్రీనివాస్‌నాయక్, వసంత్‌కుమార్, శంకర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

అమరచింత: మండలంలోని నందిమళ్ల ఎక్స్‌రోడ్ పంచాయతీ సమీపంలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు సిబ్బంది శనివారం మరమ్మతు చేపట్టారు. పైప్‌లైన్‌కు పగుళ్లు రావడంతో నీరంతా అక్కడే లీకేజీ అవుతోందని ప్రజలు మిషన్ భగీరథ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది పైప్‌లైన్ వద్ద సిమెంట్‌తో మరమ్మతు చేశారు. దీంతో నందిమళ్ల ఎక్స్‌రోడ్‌తో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయి.

తాగునీరు కలుషితమవుతున్నా పట్టదా?


మాట్లాడుతున్న తహసీల్దార్ సింధుజా

ధన్వాడ: మిషన్ భగీరథ పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు కడపయ్య, ఉమేష్‌కుమార్, గోవర్ధన్‌గౌడ్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించగా.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి వైద్యాధికారి, సింగిల్‌విండో సీఈఓ, ఎంఈఓ గైర్హాజరు కావడంతో జెడ్పీటీసీ విమలతో పాటు పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి ఇలాగే చేస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్ద చెరువు నుంచి అనుమతి పొందిన దానికంటే అధికంగా మట్టిని తరలిస్తుండగా, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పద్మిని బాయి, ఎంపీడీఓ సాయిప్రకాష్, తహసీల్దార్ సింధుజా తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పిరెడ్డిపల్లిలో కేశవులు అనే వ్యక్తికి చెందిన సెట్టర్ షాప్‌లో నిల్వ ఉన్న పీడీఎస్ రైస్ 8.60 క్వింటాళ్లను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. డీటీ పంచనామాతో పట్టుకున్న బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. ఎం. కేశవులుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.

మక్తల్: పట్టణంలోని ఎరుకలి హన్మంతుకు చెందిన తన వ్యవసాయ పొలంలో నిల్వ ఉన్న 10క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం పోలీసులు దాడులు నిర్వహించి స్టేషన్‌కు తరలించారు. అనంతరం హన్మంతుపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవచండీ మహాయాగం


సింగారంలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం శ్రీ గిరిపీఠంపై నిర్వహిస్తున్న శ్రీ నవచండీ మహాయాగం శనివారం కొనసాగింది. మూడు రోజులుగా అంబాభవాని మందిరం నిర్వాహకులతో కలిసి శివానందస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శనివారం యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న కార్యక్రమంలో 108మంది దంపతులు సాంప్రదాయ దుస్తులతో రాగా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీపరిపూర్ణ నందగిరి హాజరై ఆధ్యాత్మిక ప్రవచనం చేసి భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించాలని, పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేరేడగం పీఠాధిపతి సిద్ధిలింగేశ్వరస్వామి, యానగుంది నందిని మాతాజీ, శివానంద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

25న పశువుల సంత, తైబజార్‌లకు టెండర్లు

కోస్గి: గుండుమాల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 25న గుండుమాల్ పశువుల సంత, తైబజార్‌లకు బహిరంగ వేలం ద్వారా టెండర్లు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాయి ప్రకాష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ఆనంద్ కిషోర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాట నిర్వహించి అత్యధిక ధర పాడిన వారికి 9నెలల కాలానికి టెండరు అందజేస్తామన్నారు. ఈ వేలంలో పాల్గొనదల్చిన అభ్యర్థులు పశువుల సంతకు రూ.2వేలు, తైబజార్‌కు ఒక వెయ్యి పంచాయతీ కార్యదర్శి గుండుమాల్ పేరున డీడీలు తీసి ఒక రోజు ముందుగానే ఈ నెల 24న సాయంత్రం 5గంటల వరకు అందజేయాలన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐకి సన్మానం


ఏఎస్ఐని సన్మానిస్తున్న జిల్లా జడ్జి

నారాయణపేట: నర్వ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ బాలకృష్ణ మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, ఎస్పీయోగేష్ గౌతం, జూనియర్ సివిల్ జడ్జిలు, పోలీసు అధికారులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. పోలీసులు కోర్టుకు కేసుల విషయంలో వారధిలా పనిచేసి బదిలీపై వెళ్తున్నందున అన్నిరకాలుగా సహకరించినందుకు అభినందించారు. ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరికి బదిలీలు సర్వసాధారణమని జిల్లా జడ్జి ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


అన్నదానం ప్రారంభిస్తున్న ఆర్డీఓ మధుమోహన్

నారాయణపేట రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, ఆలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్డీఓ మధుమోహన్ అన్నారు. పట్టణంలోని బాపూనగర్ శ్రీచౌడేశ్వరీ ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ఆయన అమ్మవారికి అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, ఆలయకమిటీ సభ్యులు రామకృష్ణ, నారాయణ, మురళీమోహన్, వెంకటస్వామి, గోవింద్, గోపాల్, బాబు, సతీష్, వెంకటేష్, బాలరాజు, నర్సింహులు, పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఊట్కూరు: మండలంలో కొనసాగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ పరిశీలించారు. మండలంలోని ముగ్దుంపూరం, బిజ్వార్, పులిమామిడి, మల్లెపల్లి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం

మాగనూర్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మండల నేరడగం కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకరాచారి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని నేరడగం ఉర్దూమీడియం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టిక ఆహారాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

... Makthal town & mandal ... T Vijay Krishna S/o T Sandappa, age 33 years, Occ: Business, R/o H.No. 14-120, Vakiti Nagar, Makthal town & mandal, Narayanpet dist. Property ... (Mortgage) ...

Residential house bearing No. 14-120, constructed in residential plot admeasuring 81.21 Sq. Yrds., in block No. 14, house plinth area Ground Floor 484.48 SFt., situated at Vakiti nagar, Makthal village, Makthal mandal, Narayanpet Dist., ... East: CC Road, West: Open place of Gopanna, North: Drainage and CC Road, South: Hut of Gopanna.

Sd/- Sri Mallikarjun B.A, LL.B., Advocate & Legal Advisor, Narayanpet, Cell : 9440393742

ఘనంగా ఏరువాక వేడుకలు


పేటలో ఏరువాక వేడుకల్లో రైతులు


శ్యాసన్‌పల్లిలో ఎద్దులతో రైతుల ఊరేగింపు


పస్పులలో..

నారాయణపేట/నారాయణపేట రూరల్: భూదేవిని నమ్ముకొని పంటలు పండించే రైతులు వర్ష ఋతువు ఆరంభంలో తొలకరి చినుకు కోసం ప్రార్థిస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఏరువాక పౌర్ణమిని వేడుకలను రైతులు శనివా రం ఘనంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వీధుల గుండా కాడెద్దుల ప్రదర్శనను నిర్వహిస్తూ పళ్ల ఏరియాలోని హనుమాన్ మందిర్‌వద్దకు చేరుకున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన ఏరువాక తాడును తుంచి రైతులు నినాదాలు చేశారు. అలాగే మండలంలోని శ్యాసన్‌పల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో శనివారం ఏరువాక వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఇంట్లో ఆవులు, ఎద్దులు, వ్యవసాయ పనిముట్లను అలంకరించి పూజలు చేసి పొలాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంగ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: ఏరువాక పండుగ వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. రైతులు తమ పశువులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

మక్తల్: ఏరువాక పండుగ వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు తమ కాడెద్దులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

మాగనూర్: ఏరువాక పౌర్ణమిని శనివారం రైతులు ఆనందోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఏరువాకతాడు తెంపుడు కార్యక్రమం కనువిందు చేసింది. గ్రామ దేవతలకు, పశువుల ఘాటికి నైవేద్యాలతో పూజలు నిర్వహించారు.

ధన్వాడ: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని రైతు సోదరులతో పాటు ప్రజలు పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రైతులు తమ వృషభాలను చక్కగా అలంకరించి పూజలను నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ఎద్దులతో ర్యాలీ నిర్వహించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఏరువాకను ఘనంగా నిర్వహించారు. రైతులు ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ ఊర చావిడి వద్ద ఏర్పాటుచేసిన ఏరువాక తాడును తెంపారు. అనంతరం ఉందేకోడ్‌లో ఏరువాక తాడును తెంపిన రైతుకు ఐదు తులాల వెండి కడియాన్ని ఎంపీటీసీ నీరజ్ తొడిగారు. అనంతరం ఎద్దును ఊరేగించారు.

మరికల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఏరువాక తాడు కింద రైతులు ఎద్దులను పరుగెత్తించి ఏరువాక తాడును తెంచారు.

ఫిర్యాదులకు ప్రత్యేక కౌంటర్

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వం 200యూనిట్ల కరెంట్‌ను ఉచితంగా అందించేందుకు చేపట్టిన గృహజ్యోతి పథకంలో అర్హత ఉండి జీఓ బిల్ రానివారి కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమీషనర్ శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తు రసీదు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్‌తో వచ్చి అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com